
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు


శనివారం 7 జూన్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37 (శుక్రవారం)
కనిష్ఠం : 30



కాకినాడలో డీఎస్సీ అభ్యర్థినుల తనిఖీ..



నాన్న తోడుగా..

డీఎస్సీ 30వ తేదీ వరకు పరీక్షలు

తొలిరోజు 310 మంది గైర్హాజరు

కాకినాడరూరల్/అమలాపురం రూరల్/రాజమహేంద్రవరం అర్బన్, జూన్6(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగాడీఎస్సీ-2025 ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. తొలిరోజు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి గంటన్నర ముందు అనుమతించారు. మొదటిగా అభ్యర్థుల హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపును పరిశీలించారు. రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజీ లూథర్‌గిరి రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శుక్రవారం జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలకు 1200 మంది దరఖాస్తు చేసుకోగా 1,059 మంది హాజరయ్యారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం సెషన్‌లో 600 మందికిగాను 532 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 600 మందికిగాను 527 మంది హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్ తనిఖీ చేశారు. కాకినాడ జిల్లాలో ఉదయం ఐదు కేంద్రాల్లోనూ, మధ్యాహ్నం ఒక కేంద్రంలోనూ జరిగినట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకూ నిర్వహించిన పరీక్షకు 842 మంది హాజరుకావాల్సి ఉండగా 756 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 182 మంది హాజరుకావాల్సి ఉండగా 137 మంది హాజరయ్యారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1024 మందికి 893 మంది హాజరుకాగా 131 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో తొలిరోజు శుక్రవారం డీఎస్సీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. అమలాపురం రూరల్ మండలం భట్నపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన తొలిరోజు మొదటి సెషన్ పరీక్షకు 18 మంది అభ్యర్థులు హాజరు కాలేదన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 20 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారన్నారు. తొలిరోజు రెండు కళాశాలల్లో మొదటి సెషన్ పరీక్షలు మాత్రమే నిర్వహించామన్నారు.



రాజమహేంద్రవరంలో డీఎస్సీ అభ్యర్థినుల తనిఖీ..పరీక్షా కేంద్రంలో కలెక్టర్ ప్రశాంతి పరిశీలన.. రూమ్ నెంబర్ చూస్తున్న అభ్యర్థులు



ఉండమ్మా.. పరీక్ష రాసి వచ్చేస్తా..



రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం భవనం

అద్భుతమే కానీ..!

విజ్ఞాన కేంద్రం చూద్దామంటే దారేది

పనులు ఆరంభం 2019

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అదొక అద్భుతం..అయినా ఎందుకో నిర్లక్ష్యం.. నాడు వైసీపీ ప్రభుత్వంలో కోట్లు ఖర్చు పెట్టారు.. ఎందుకు కొరగాకుండా వదిలేశారు..పోనీ కూటమి ప్రభుత్వంలో అయినా పట్టించుకుంటా రనుకుంటే ఎందుకో మరి వదిలేశారు..ఎప్పుడో డిసెంబరు రెండో వారంలో అనుకుంటా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తారు..ప్రారంభిస్తారని హడావుడి చేశారు.. నేటికీ ఆరంభమే కాలేదు.. కోట్లు ఖర్చు చేసి బొమ్మూరులో నిర్మించిన రాజమండ్రి విజ్ఞాన కేంద్రం (సైన్స్ మ్యూజియం) ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఈ నెల 10 లేదా 12 తేదీల్లో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- నేటికి ప్రారంభంకాని సైన్స్ మ్యూజియం
- 2019లోనే నిర్మాణ పనులు ఆరంభం
- వైసీపీ హయాంలో పూర్తయిన పనులు
- గతంలో పవన్ ప్రారంభిస్తారని ప్రచారం
- నిరుపయోగంగా మారిన విజ్ఞానం
- సీఎం చంద్రబాబు రాక..మళ్లీ ఊహాగానాలు

2017లో మంజూరైన రాజమండ్రి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి 2018 ఫిబ్రవరి 18న అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. రూ.16.82 కోట్లు అంచనా వ్యయంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. కానీ ఎన్నికల సీజన్ కావడంతో పని జాప్యమైంది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో చాలాకాలంపాటు దీని ఊసే మరచిపోయారు. తరువాత ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ పనిచేసినా గందరగోళమే. సైన్స్ మ్యూజియం పరిస్థితి కూడా అంతే. కోట్లు ఖర్చు పెట్టి కట్టారు వదిలేశారంతే.. నేటికి వినియోగంలోకి రాకుండా ఉంచేశారు. 2019లో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే మ్యూజియం నిర్మాణ పనులు ప్రారంభమైనా రివర్స్ టెండరింగ్ నేపథ్యంలో నిలిచిపోయాయి. సుమారు మూడేళ్లపాటు పనులు ముందుకు కదల్లేదు. నిధులున్నా పనులు నీరసమే. ఆ తరువాత పనులు ఆరంభించినా తూతూ మంత్రంగా చేసి వదిలేశారు.



భవనం లోపల ఉండే రకరకాల యంత్రాలు



గ్రౌండ్‌లో డైనోసార్ బొమ్మ... ఇలాంటివి ఎన్నో..

సమస్య ఉన్నా కట్టేశారు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సైన్స్ మ్యూజియం నిర్మాణానికి బొమ్మూరులో సుమారు 5 ఎకరాల స్థలం కేటాయించారు. రోడ్డు కంటే బాగా పల్లంగా ఉంటుంది. దీనిని మెరక చేయడానికి అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ మట్టి కూడా ఏర్పాటుచేస్తామని చెప్పారు. తర్వాత ప్రభుత్వం మారింది. అవేమీ పట్టించుకోలేదు. పల్లపు ప్రాంతంలోనే నిర్మించారు. దీనిని సరిదిద్దడానికి జిల్లా అధికార యంత్రాంగం నానా తంటాలు పడ్డారు. ప్రస్తుతం విలువైన ఈ విజ్ఞాన కేంద్రం పల్లపు ప్రాంతంలోనే ఉంది. కానీ ప్రహరీ చుట్టూ డ్రెయిన్లు తవ్వారు. ప్రవాహరీ లోపల, విజ్ఞాన కేంద్రం చుట్టూ వానపడినా లోపలకు నీరు వచ్చే ప్రమాదం ఉంది. అంత పల్లంగా ఉంటుంది. దీనికోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి, వాన నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. ఎంత చేసినా ఈ విజ్ఞాన కేంద్రానికి ఇది సమస్యే. దీని నిర్మాణ సమయంలో ఏపీ కాస్ట్ అధికారులు కనీస పర్యవేక్షణా చేయలేదు. సైట్ ఆఫీసర్‌ను నియమించలేదు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఒక సూపర్‌వైజర్ నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చేవారు. దీంతో ఇక్కడ సమస్యగా మారింది. దీంతో ఈ కేంద్రం ఎలా తెరవాలో తెలియక ప్రస్తుత ప్రభుత్వంలో మల్లగుల్లాలు పడుతోంది.. తెరిస్తే నిర్వహణ కష్టంగా ఉండనుంది. తెరవకపోతే విజ్ఞానం మూలనపడిపోతోంది. ఈనెల 12న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేసే అవకాశం ఉంది.



నీటి ప్రయోగశాల

లోపలంతా అద్భుతః

ఈ విజ్ఞాన కేంద్రం చాలా బాగుంటుంది. లోపల ఒక అద్భుతమే. సైన్స్‌కు సంబంధించిన పరికరాలు.. ప్రయోగాలు ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం కూడా. ఇది జీప్లస్ 1గా నిర్మించారు. గ్రౌండ్‌లో మూడు రూమ్‌లు ఉన్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్కు ఉంది. రన్ నియన్స్ గాలరీలో ఫిజిక్స్, మ్యాథ్స్‌కి సంబంధించి 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన మరో నిర్మాణం చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. చిత్రాల సౌండ్ ఫైల్‌ల సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక, శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెల్‌లు ఉన్నాయి. అజర్నీ విత్ లైట్ పై స్పేస్, గెలాక్సీ, సౌర వ్యవస్థ, గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి. డ్రోన్లు, రోబోల టెక్నాలజీని చెప్పడం కోసం రోబోటిక్ ల్యాబ్ ఉంది. ఈ విజ్ఞాన కేంద్రం అధికారిగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒకరు, నలుగురు ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, టెక్నీషియన్ ఒకరిని నియమించారు. హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ, ఆఫీసుబాయ్‌తో కలిపి 16 మంది పనిచేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

కాకినాడ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)పర్సన్ ఇన్‌ఛార్జిగా తుమ్మల రామస్వామి (బాబు) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏకాదశి మంచి ముహూర్తం కావడంతో ఉదయం 7.30 గంటల సమయంలో బాధ్యతలు స్వీకరించగా సీఈవో నరసింహారావు సంతకాలు చేయించారు. డీసీసీబీకి ఇప్పటి వరకూ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. తుమ్మల బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కూటమి నాయకుల సమక్షంలో త్వరలో ప్రమాణ స్వీకార వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ జీఎం ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



వెళ్లొస్తాం అంటూ.. తిరిగిరాని లోకాలకు!

వెళ్లొస్తాం.. అంటూ బయలుదేరారు.. కారులో బయలుదేరిన కుమారుడు, కుమార్తె.. మనవరాలిని.. కుటుంబీకులు సాగనంపి ఇంకా ఇంటి లోపలకు కూడా వెళ్లలేదు.. ఆ మాటలు ఇంకా చెవిలో వినపడుతూనే ఉన్నాయి.. అంతలోనే ఒక విషాదకర వార్త వారి చెవిన పడింది.. కారు చెట్టును ఢీకొనడంతో కుమారుడు, మనవరాలు మృతి చెందారన్న వార్తతో అక్కడే కూలబడి పోయారు..

7



సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీని సత్కరిస్తున్న డీఈవో సలీంబాషా

12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

పూర్తి స్థాయిలో తరగతి గదులను సన్నద్ధం చేయాలి

సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీ

అమలాపురం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీ నుంచి జిల్లాలోని పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ పేర్కొన్నారు. ముందస్తుగా పాఠశాలల సంసిద్ధత చర్యలపై ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం అమలాపురంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మమ్మీ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచేనాటికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే పరిశీలించి అవసరమైతే మరమ్మతులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావు, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీని సత్కరించారు.



ఆస్తుల.. పరిరక్షణ!

కేంద్రం పట్టణ ప్రాంతాల్లో ఒక సర్వే చేస్తోంది.. ఈ సర్వే ఎంతో లాభదాయకం. యాజమాన్య వివాదాలు, దీర్ఘకాలికంగా చట్టపరమైన కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. రోడ్లు, మురుగు కాలువలు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పన, ప్రాజెక్టుల అమలుకు అడ్డంకులు ఉండవు. ఆస్తులు, భూరికార్డులు పారదర్శకంగా డిజిటలైజ్డ్ విధానంలో అందుబాటులో ఉంచుతారు. నగరపాలక సంస్థ, కేంద్ర, ప్రభుత్వాల ఆస్తుల గుర్తింపునకు అవకాశం ఉంటుంది.



- దేశవ్యాప్తంగా 'నక్ష' సర్వే
- భూ వివాదాల పరిష్కారమే లక్ష్యం
- రాష్ట్రంలో 10 పట్టణాల్లో అమలు
- పైలెట్ ప్రాజెక్టుకు కాకినాడ ఎంపిక
- స్థలాలకు ఖచ్చితమైన రికార్డులు
- డిజిటలైజేషన్ చేసేలా ఏర్పాట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణాల్లో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ, ఉన్న రికార్డుల నవీకరణ ద్వారా వివాదాలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ మేరకు జాతీయ జియో స్పేషియల్ పరిజ్ఞానం ఆధారంగా పట్టణ ఆవాసాల్లో భూ సర్వే (నక్ష) పేరుతో ఈ ఏడాది సర్వే చేపట్టింది. పైలెట్ ప్రాజెక్టు అమలుకు దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసి రూ.194 కోట్లు కేటాయించింది. మన రాష్ట్రంలో పది పుర, నగరపాలక సంస్థలను కేంద్రం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. వాటిలో ఒంగోలు, అనంతపురం,గుంటూరు,నెల్లూరు, కర్నూలు, ఏలూరు, తిరుపతి, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలతో పాటు మన జిల్లాలోని కాకినాడ నగరపాలక సంస్థను తొలివిడతగా కేంద్రం ఎంపిక చేసింది. వీటిలో 524 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఏరియల్ సర్వే చేసి 9.50 లక్షల ఆస్తులను మ్యాపింగ్ చేసి డిజిటలైజ్ చేయనున్నారు. 2026 మార్చి నెలాఖరులోపు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు కార్డులు అందజేయనున్నారు. రెండో దశలో మరికొన్ని పట్టణాలు ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.

కాకినాడలో ముందస్తు సర్వే...

కాకినాడ నగరంలో ప్రస్తుతం ముందస్తు ఏరియల్ సర్వే నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ అనే ఓ ప్రైవేటు సంస్థ ఈ సర్వే చేపట్టనుంది. డ్రోన్స్ ఎగరవేత, జీపీఎస్ కోఆర్డినేషన్‌కు సెంట్రల్ పాయింట్లు మార్కింగ్ చేసుకున్నారు. కాకినాడలో 32 కిలోమీటర్ల మేర 20 మార్కింగ్ పాయింట్లు వేశారు. ఈ ప్రాంతాల నుంచే డ్రోన్లు ఎగరవేసి బౌండరీల ఛాయాచిత్రాలను తీసుకుంటారు.

మూడు విడతల్లో సర్వే

ఈ సర్వే మూడు విడతల్లో చేపడతారు. ప్రస్తుతం ఆ సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం మైసూరులో జరుగుతోంది. రాష్ట్రంలోని ఎంపిక చేసిన పది నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్లకు వారం రోజులపాటు శిక్షణ అందిస్తున్నారు. ఈ నక్ష సర్వే మూడు దశల్లో ముగిసాక డిజిటలైజ్డ్ కార్డుతో కూడిన ఆస్తి ధ్రువపత్రం అందజేస్తారు. ఏ విధమైన సమస్య లు లేనివాటిని తొలుత సర్వే చేస్తారు. ప్రజలు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, కచ్చితమైన వివరాలు అందించాలి. - **కృష్ణారావు, డీసీపీ, కాకినాడ**



నయనానందకరం బాలబాలాజీ కల్యాణం

గోవిందనామస్మరణలతో మార్మోగిన అప్పనపల్లి

6

పొలాల్లోకి ప్రవహిస్తున్న ఉప్పునీరు

- ఓల్డ్‌అయినాపురం నుంచి రంగరాజులోకి ఉప్పునీరు
- సార్వా సాగుపై రైతుల్లో సందిగ్ధం
- పది రోజుల్లో షట్టర్లు ఏర్పాటు చేస్తామంటున్న అధికారులు



ఉప్పలగుప్తం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఓల్డ్ అయినాపురం డ్రెయిన్ షట్టర్స్ దెబ్బతిన్నాయి. ఈ డ్రెయిన్‌కు అయినాపురం సెక్షన్ పరిధిలో కుంచెనపల్లి టన్నెల్ వద్ద ఆటోమేటిక్ షట్టర్స్ ఉన్నాయి. పోటు ద్వారా నీరు గోదావరిలోకి ప్రవహించి, పాటు సమయంలో నీరు కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి ప్రవహిస్తోంది. టన్నెల్ వద్ద ఆటోమేటిక్ షట్టర్స్ ఏర్పాటుతో గోదావరి నుంచి ఉప్పునీరు డ్రెయిన్‌లోకి రాకుండా నియంత్రణ జరుగుతుంది. ఆటోమేటిక్ షట్టర్స్ పాడవ్వడంతో మరమ్మతులకు పంపించారు. పంటకాల్వలు మూసిన తర్వాత డ్రెయిన్లలో ఉప్పునీరు మాత్రమే ప్రవహిస్తోంది. ఈ కారణంగా ఈ డ్రెయిన్‌లో ఉప్పునీటి ప్రవాహ నియంత్రణ లేకపోవడంతో పాటుపోటులకు ఉప్పునీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. పోటు సమయంలో గోదావరి నుంచి ఉప్పునీరు నేరుగా డ్రెయిన్ ద్వారా ఇతర డ్రెయిన్లలోకి చేరుతోంది. అక్కడి నుంచి సముద్రంలోకి చేరుతుంది. ఇక్కడ అడ్డుకట్ట వేయడంతో ఎడమ వైపునకు వెళ్లవలసిన నీరు రివర్స్‌లో కుడివైపునకు ప్రవహించి సమీపంలోని రంగరాజుకోడు డ్రెయిన్‌లోకి, తర్వాత పొలాల్లోకి ఉప్పునీరు ప్రవహిస్తోంది. ఆటోమేటిక్ షట్టర్స్ పది రోజుల్లో ఏర్పాటుచేస్తామని హెడ్‌వర్క్స్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వార్స్‌తో శశిథరూర్ నేతృత్వంలో అఖిలపక్ష బృందంలో హరీష్ మాధుర్

ఉగ్రవాదంపై పోరుపై అమెరికా ఉపాధ్యక్షుడిని కలిసిన భారత్ బృందం

అమలాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై అమెరికా భారత్‌కు మద్దతు తెలుపుతోందని ప్రతినిధి బృందంలో ఒకరైన అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ తెలిపారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వార్స్‌తో శశిథరూర్ నాయకత్వంలో వెళ్లిన అఖిలపక్షం బృందం ఆపరేషన్ సింధూర్ నేపథ్యాన్ని వివరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వార్స్‌తో భేటీ అయిన ప్రతినిధి బృందం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ ఏ పరిస్థితిలో దాడికి పాల్పడాల్సి వచ్చిందో వివరించడం ద్వారా వారి మద్దతును కూడగట్టుకున్నట్టు ఎంపీ హరీష్ తెలిపారు. పహల్గాంలో 25 మందిని ఏవిధంగా పొట్టన పెట్టుకున్నారో వివరించామని ఆయన తెలిపారు. పాకిస్తాన్‌లో మరణించిన వారికి సోషల్‌మీడియా వేదికగా సంతాపం తెలిపిన పోస్ట్‌ను ఉపసంహరించుకుందని, కొలంబియా దేశం మనకు మద్దతు తెలియచేయడానికి ఇదే ఉదాహరణని హరీష్ వ్యాఖ్యానించారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు

అమలాపురంటౌన్, జూన్6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు శనివారం వెలువడతాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఫలితాలను తెలుసుకోవచ్చన్నారు. మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు హాయ్ అని మెసేజ్ పెట్టి ఫలితం పొందవచ్చన్నారు. గతనెల 12వతేదీ నుంచి 20వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు.



సీజన్లో ఒక్కసారైనా తినాలనిపించే...

సీమ చింతకాయలు

సామర్లకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీమ చింతకాయలు... ఇవి వైశాఖ మాసం నుంచి జ్యేష్ఠ మాసం వరకు విరివిగా లభిస్తాయి. వీటిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అమితంగా ఇష్టపడుతుంటారు. వేసవిలో సెలవుల్లో పల్లెల్లో పొలాలు, పుంతలు, కాల్వ గట్లపై ఉన్న చెట్ల నుంచి సీమ చింతకాయలను చిన్నారులు సేకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనే లభించే ఇవి ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లోనూ కనిపిస్తున్నాయి. వ్యాపారులు కిలో రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. ఈ రెండు నెలలు కూడా పలువురికి జీవనోపాధిగా ఉంటోంది. కొంతమంది మహిళలు గంపలతో ఇంటింటికీ తిరుగుతూ, ఇంకొంతమంది తోపుడుబండ్లపైన, మోటారు సైకిళ్లపైన రహదారుల వెంబడి విక్రయాలు సాగిస్తున్నారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెప్తున్నారు. గర్భిణులు తింటే గర్భ విచ్ఛిత్తి జరిగే ప్రమాదముందని మరికొందరు వైద్యులు వివరిస్తున్నారు.



ఆరోగ్య ప్రయోజనాలెన్నో

డాక్టర్ ప్రవీణ

మధుమేహ వ్యాధిని నియంత్రణలో ఉంచడానికి సీమచింతకాయలు దోహదపడతాయి. విటమిన్-సి, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని పలు వైరస్‌లు, బ్యాక్టీరియాలతో సమర్థవంతంగా పోరాడి రోగాల బారినపడకుండా కాపాడుతుంది. గుండెకు ఎంతో మేలుచేస్తుంది. రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడే గుణాలు పుష్కలంగా ఉంటాయి.

మూడు గంటల్లో 25 వేలమందికి భోజనాలు

అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలకు భూమి పూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రోజుకు మూడు గంటల్లో 25వేల మందికి భోజనాలు తయారు చేసేందుకు వీలుగా అక్షయ పాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత వంటశాల నిర్మాణం చేపట్టనుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి వరలక్ష్మీనగర్‌లో అక్షయ పాత్ర ఫౌండేషన్ రెండో దశ కేంద్రీకృత వంట శాల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు, హరేకృష్ణ మూమెంట్ ఆఫ్ ఇండియా సత్యగౌరచంద్రదాస, ఓఎన్జీసీ సీజీఎం ప్రభాల్ సేన్‌గుప్తా, ఈడీ, సర్వీస్ మేనేజరు రజత్‌మల్హోత్రా, సంజయ్‌లాల్, ఓఎన్జీసీ సీజీఎం (ఢిల్లీ) పీవీవీ సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారాన్ని సమర్థవంతంగా అందించేందుకు రూ.18.2 కోట్ల సీఎస్సార్ నిధులతో రెండో దశ వంటశాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన వివిధ జిల్లాల స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఎన్ఆర్ఐ ఆర్థిక సాయం

బాధిత కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని ఎంపీడీవోకు దరఖాస్తు



ఎంపీడీవోకు అందజేసిన దరఖాస్తును చూపిస్తున్న అచలచౌదరి

రాయవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో పేద కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన వైట్ల కృష్ణారావు మనువరాలు బలుసు అచలచౌదరి జర్మనీలో ఉద్యోగం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4(పబ్లిక్ పీపుల్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్) పథకానికి అచలచౌదరి ఆకర్షితురాలయ్యారు. గ్రామంలో ఉన్న కట్టుంగ రాజశేఖర్ దీర్ఘకాలిక రోగంతో మంచం పట్టడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో బాధిత కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని, అందుకు తగ్గ అనుమతులు అందజేయాలని కోరుతూ ఎంపీడీవో కీర్తిస్పందనకు అచల చౌదరి శుక్రవారం దరఖాస్తు అందజేశారు. దాత ఔదార్యాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో అచల చౌదరి తాత వెట్ల కృష్ణారావు, దేవ్ శ్రీను, టీడీపీ నాయకుడు ఉండవల్లి రాంబాబు పాల్గొన్నారు.

వాడపల్లి వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర పూజలు



వాడపల్లిలో పల్లకి మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,83,792 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భీమవరానికి చెందిన సీవీ చంటి-శాంతి దంపతులు రూ.1,16,000 విరాళం సమర్పించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

తిరునక్షత్ర ఉత్సవాలు.. వాడపల్లి వెంకన్న ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ వేద పారాయణం, సాయంత్రం స్వామి వారి పల్లకి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉపకమిషనరు ఏర్పాట్లు నిర్వహించారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, వేదపండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.

> ఆటిజంతో బాధపడే విద్యార్థులకు అండగా నిలవడంతో పాటు అటువంటి వారిని గుర్తించి సరైన శిక్షణ ఇచ్చేందుకు ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా తొలి దశలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఆటిజం కేంద్రాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ27.25 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. ఈ కేంద్రాల ద్వారా ఆటిజం బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిరంతరం శిక్షణ ఇస్తారు. ఆటిజం లక్షణాలతో బాధపడుతున్న వారిని తొలి దశలో గుర్తించి వారికి అవగాహన కలిగించే కేంద్రాలుగా ఇవి పని చేయనున్నాయి.



ఆటిజం బాధిత విద్యార్థులకు అండగా

- తొలి దశలో ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో 14 కేంద్రాలు ఏర్పాటు
- ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.27.25 లక్షలు చొప్పున నిధుల మంజూరు
- ఆటిజం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శిక్షణ
- చిన్నారులకు నిరంతరం పరీక్షలు

(పిఠాపురం/గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

ఆటిజం అనేది నాడీ సంబంధిత రుగ్మత. ఇది సామాజిక కమ్యూనికేషన్, ప్రవర్తనల్లో తేడాలను కలిగిస్తుంది. ఆటిజం ఉన్న చిన్నారులు, వ్యక్తులు ఇతరులు చెప్పే విషయాలను అర్థం చేసుకోవడంలోను, చెప్పదలచుకున్న విషయాలను కమ్యూనికేట్ చేయడంలోను ఇబ్బందులు ఎదుర్కొంటారు. వీరు పైకి సాధారణ పిల్లలు, వ్యక్తులుగా కనిపించినప్పటికీ వారికి చెప్పిన అంశాలను అర్థం చేసుకోవడానికి సమయం తీసుకుంటారు. తమ భావనలను వ్యక్తీకరించడంలో ఇబ్బందిపడతారు. ఇటువంటి లక్షణాలతో ఉన్నవారిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సాధారణ శిక్షణ ద్వారా అందరి పిల్లలు, వ్యక్తులగానే తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో ఆటిజం లక్షణాలతో ఉన్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. వీరికి శిక్షణ ఇచ్చి సాధారణ విద్యార్థులు మాదిరిగానే అన్ని అంశాలనూ అర్థం చేసుకునే రీతిలో శిక్షణ, చికిత్స అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.



ఆటిజం సెంటరు ఏర్పాటుచేసే గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు అనుమతి ఇస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిఠాపురం మండలం నరసింగపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, సామర్లకోట మండలం ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దాపురం మండలం కాండ్రకోట జడ్పీహెచ్ఎస్, పెద్దాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఇందుకు రూ.1.94 కోట్లు మంజూరు చేశారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండపేట పట్టణంలోని అంకసాని చెరువు, అమలాపురం వెచ్చావారి అగ్రహారం, రామచంద్రపురం చాకలిపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాల ఏర్పాటుకు రూ.1.11 కోట్లు మంజూరు చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు మండలం ఇసుకపట్ల, పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజమహేంద్రవరం ఇన్నీస్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిడదవోలు మండలం సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాల ఏర్పాటుకు రూ.83.25 లక్షలు మంజూరయ్యాయి.

లక్ష్యాలు ఇవీ...

ఆటిజంతో బాధపడే విద్యార్థుల గుర్తింపునకు స్క్రీనింగ్, వారి పరిస్థితి అంచనా, శిక్షణ, వారికి సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యా బోధన తదితర అంశాలు లక్ష్యంగా ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆటిజంతో బాధపడే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులు చెప్పే విషయాలను అర్థం చేసుకొనేలా తీర్చిదిద్దనున్నారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, ఇంటెలెక్చువల్ డిజేబులిటీ, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజేబులిటీపై అవగాహన కల్పించే హబ్‌లుగా ఈ కేంద్రాలు వ్యవహరించనున్నాయి. చిన్నారులకు నిరంతరాయంగా స్క్రీనింగ్ నిర్వహించి ఇటువంటి లక్షణాలతో బాధపడుతున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగు శిక్షణ, చికిత్స అందించనున్నారు. ఆటిజంతో బాధపడే విద్యార్థుల్లో అంతర్లీనంగా పలు అంశాల్లో ప్రతిభ చూపడాన్ని గుర్తించి వారిని అందులో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఆటిజం సెంటర్ల ఏర్పాటు, టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీ, ఈ కేంద్రాల్లో నియమించాల్సిన సిబ్బంది, ఉపాధ్యాయులు తదితర అంశాలను గుర్తించేందుకు సమగ్ర శిక్షాలో రాష్ట్ర స్థాయిలో ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించారు.

పీఎంశ్రీ ద్వారా మంజూరు

కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ అమలు చేస్తున్న పీఎంశ్రీ స్కూల్స్ కాంపోనెంట్ ప్రాజెక్టు ఇన్నోవేషన్ ప్రోగ్రాం ద్వారా ఆటిజం బాధిత విద్యార్థులకు ప్రత్యేకంగా కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలోని ప్రతి మునిసిపాలిటీ లేదా పట్టణాలకు దగ్గరగా ఉండి, ఆటిజం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో 125 కేంద్రాలను తొలి దశలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇదే విషయాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించి... ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకొస్తామని అసెంబ్లీలో వెల్లడించారు. దీనికి అనుగుణంగా కేంద్రంతో సంప్రదింపులు జరపడంతో 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. ఈ కేంద్రాలు ఏర్పాటుచేసే చోట ఒక యూరినల్, ఒక డిజేబుల్డ్ ఫ్రెండ్లీ టాయిలెట్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

ఇప్పటికే ఉన్న భవిత, నాన్ భవిత కేంద్రాల ద్వారా వీరికి శిక్షణ అందుతున్నప్పటికీ ఆటిజం బాధిత విద్యార్థుల కోసం ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుతో వారిపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించడానికి వీలవుతుంది. తొలి దశలో మంజూరైన ఆటిజం సెంటర్లను రెండు విడతల్లో ఏర్పాటుచేసి వాటి ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

9న స్టార్టప్ సమ్మిట్ 2025పై అవగాహన సదస్సు

మంత్రి సుభాష్



రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంట్లో పారిశ్రామిక వేత్తను సృష్టించే లక్ష్యంతో ఈనెల 9న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో సీడాప్ ఆధ్వర్యంలో కోనసీమ స్టార్టప్ సమ్మిట్-2025 పేరిట ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రొసెసింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. కోనసీమ జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి కీలకశాఖల భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ, నిపుణులతో సందేహాల నివృత్తి అనంతమైన అవకాశాల కల్పన ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి శిక్షణ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు ఎంపీ హరీష్, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, జిల్లాలో ప్రజాప్రతినిధులు, యువ పారిశ్రామికవేత్తలు, అన్ని శాఖల అధికారులు, బ్యాంకింగ్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

అపర్ణాదేవికి మామిడిపండ్లతో అలంకారం



గొల్లప్రోలు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణాదేవిని మామిడి పండ్లతో అలంకరించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మామిడిపండ్లు, పుష్పాలతో అలంకారం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు చేయగా వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులు పెంచడమే లక్ష్యం

- ఐసీఏఆర్ డైరెక్టర్ శేషుమాధవ్
- రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలనే ఉద్దేశ్యంతో పెత్తఎత్తున ప్రీ ఖరీఫ్ ప్రచారాన్ని మే 29 నుంచి జూన్ 12 వరకు వికసిత్ క్రిషి సంకల్ప్ అభియాన్ (వీకేఎస్ఏ) కార్యక్రమం చేపడుతోందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. ఈ మేరకు ఐసీఏఆర్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ఐసీఏఆర్ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కేవీకేలు, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ విభాగాలు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2వేలకు పైగా జట్లుగా ఏర్పడి ప్రతిరోజూ 700 జిల్లాలు 6500 గ్రామాలను సందర్శిస్తూ 1.5కోట్ల రైతులను కలిసి రాబోయే ఖరీఫ్ సీజనులో రైతుల ఆదాయాన్ని పెంచడానికి, స్థిరమైన వ్యవసాయం చేయడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంలోని ఎన్ఐఆర్‌సీఏ 29 శాస్త్రవేత్తలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాలలోని 16 కేవీకేలతో కలిసి 29 జట్లుగా ఏర్పడి మే 29 నుంచి విరివిగా రైతులతో మమేకమై చర్చిస్తున్నామన్నారు. ఎనిమిది రోజులుగా ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రవేత్తలు 228 గ్రామాలను సందర్శించి 47,230 మంది రైతులను, రైతు మహిళలను కలిసి వికసిత కృషి ఉద్దేశ్యాన్ని నెరవేర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని మాగంటి శేషుమాధవ్ అన్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా నోడల్ సెంటిస్ట్ డాక్టర్ వై.సుబ్బయ్య వ్యవహరిస్తున్నారన్నారు.

నయనానందకరం బాలబాలాజీ కల్యాణం

- గోవిందనామస్మరణలతో మార్మోగిన అప్పనపల్లి
- శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు



అప్పనపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, బాలబాలాజీస్వామి



మామిడికుదురు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో వైనతేయ నదీ తీరంలో వేంచేసి ఉన్న, బాలతిరుపతిగా వర్థిల్లుతున్న అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నయన మనోహరంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తాన అర్చకులు స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి తిరు కల్యాణోత్సవాలు సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాచార్యులు, చినజీయర్ స్వామి శిష్యబృందం, ఆలయ ముఖ్య ఉపార్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎదురుకోలు స్నాహం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పెళ్లి పందిరిలో స్వామివారి కల్యాణాన్ని ఉభయ దేవేరులతో శాస్త్రోక్తంగా 9.15 గంటలకు కన్నుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవాలను ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, నగరం ఏఎంసీ చైర్మన్ పెను మాల లక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ మండలాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, బైరిశెట్టి దుర్గా రామకృష్ణలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామి కల్యాణాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గరుడ వాహన సేవ

అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం పలు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఆరాధన, సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, నిత్యహోమం, బలిహరణ, చతుస్థానార్చనలు, ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై కోలాటం, వివిధ రకాల డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. మన్యం బ్రదర్స్ ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సాయంకాలం చతుస్థానార్చనలు, నిత్య ఉపాసన, బలిహరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయార్చకుల పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెంకు చెందిన కోలాట భజన సమాజంవారు నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రముఖులు



సాలీడ్‌గా..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ సాలీడు ఇలా గట్టిగా అల్లుకోగా ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం

వెళ్లొస్తాం అంటూ.. తిరిగిరాని లోకాలకు!



చెట్టును ఢీకొని నుజ్జు నుజ్జు అయిన కారు

- వేప చెట్టును కారు ఢీకొనడంతో ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- పోతవరంలో విషాదఛాయలు

నల్లజర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పోతవరం- యర్నగూడెం రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన మల్లేశ్ (22) అతడి తల్లి రత్న కుమారి, చెల్లి అంకిత, మేనకోడలు ప్రియ ఆర్షి (3)తో కలిసి తన కారులో నిడదవోలు దగ్గర కలవచర్లకు ఓ వివాహ రిసెప్షన్‌కు వెళ్తుండగా పోతవరం- యర్నగూడెం గ్రామాల మధ్య రహదారి పక్కనే ఉన్న వేప చెట్టును కారు ఢీకొంది. మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందగా ఆర్షి, రత్నకుమారి, అంకితకు గాయాలు కాగా ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఆర్షి చికిత్స పొందుతూ మృతిచెందింది. వారు ఇంటి నుంచి బయలుదేరిన 5 నిమిషాల్లో ప్రమాదం జరిగింది. 5 నిమిషాల క్రితం బయలుదేరిన వారు మృత్యువాడ పడడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించడంతో స్థానికులు కంటతడి పెట్టారు. మల్లేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జాతర కోసం పోతవరం వచ్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్నాడు. ఇలాంటి తరుణంలో దుర్ఘటన జరగడంతో పోతవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




మరణించిన మల్లేశ్, ఆర్షి (ఫైల్ ఫొటోలు)

గొంతు కోసి.. బండరాయితో మోది..

కోరుకొండ మండలం నిడిగట్ల- గాడాల సరిహద్దులో యువకుడి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోరుకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నిడిగట్ల- గాడాల సరిహద్దులో యువకుడి హత్య జరిగినట్టు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీ రాత్రి రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన కొవ్వాడ అబ్బులు(30), రాజమహేంద్రవరంలోని ఆర్యాపురానికి చెందిన వీరబాబు, దుర్గాసాయి, ఆకుల గణేష్ పార్టీ చేసుకున్నారు. రాజమహేంద్రవరం రివర్‌బేలో స్నానం కూడా చేశారు. అక్కడ వీరబాబు సెల్‌ఫోన్ కింద పడి పగిలిపోయింది. దీంతో నలుగురి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం రాత్రి మద్యం తాగారు. తదుపరి తోపులాట జరిగింది. అనంతరం గొడవ సద్దుమణిగి ఎవరి ఇంటికి వారు వెళ్లిపోతుండగా అబ్బులు.. వీరబాబు బండి ఆపి వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అందరం కలిసి మాట్లాడుకుందామని కోరుకొండ మండలం నిడిగట్ల- గాడాల సరిహద్దు ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడకు వెళ్లిన అబ్బులు గొంతు కోసి ఆపై తలపై బండరాయితో మోదడంతో అబ్బులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ హత్య కేసులో వీరబాబు, దుర్గాసాయి, ఆకుల గణేష్, తరుణ్, శ్రీనివాస్‌రెడ్డిని నిందితులుగా భావిస్తున్నారు. క్లూస్ టీం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించింది. అలాగే అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగా విగ్రహ వివాదానికి పరిష్కారం

ఇరు వర్గీయులతో అధికారుల చర్చలు

అంతర్వేది, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వంగవీటిరంగా విగ్రహం విషయంలో ఇటీవల వివాదం జరిగింది. దీంతో డీఎస్పీ, ఎమ్మెల్యే, ఆర్డీవో, నాయకులు ఇరు వర్గీయులతో అప్పుడు చర్చించారు. శుక్రవారం ఇరు వర్గీయులను కూర్చోబెట్టి ఆర్డీవో మాధవి, సీఐ నరేష్‌లు వివాదానికి పరిష్కారం చూపారు. విగ్రహం పొడవు, వెడల్పులు అనుకూలంగా మార్చి ఏర్పాటు చేసుకోమని సూచించారు. దీంతో రంగా విగ్రహ వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాశ్రీనివాస్, వీఆర్వోసుధాకర్, స్థానిక నాయకులు ఉన్నారు.



అంతర్వేదిలో ఇరు వర్గీయులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి, సీఐ నరేష్

అమాయకులు, పేదలే టార్గెట్!

లోన్లు ఆశ చూపి డబ్బు లాగేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రూ.కోట్లలో లావాదేవీలు
- రూ.18 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



స్వాధీనం చేసుకున్న అకౌంట్ పుస్తకాలు, ఏటీఎంలు, ఫోన్లు



కాకినాడలో అరెస్ట్ అయిన నిందితులను చూపుతున్న పోలీసులు



మాట్లాడుతున్న ఎస్పీ

కాకినాడ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అమాయకులు, పేద ప్రజలే వారి టార్గెట్. ఆధార్ కార్డు ద్వారా బ్యాంక్ ఖాతా తెరిచి సంబంధిత బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డ్, సిమ్‌కార్డ్ ఒక కిట్‌గా మాకు ఇవ్వడం ద్వారా మీకు లోన్‌లు, నెలకు రూ.5వేలు ఇస్తామని ఆశ చూపుతూ నమ్మబలికి తద్వారా ఆ కిట్లను అమాయకుల వద్ద నుంచి తీసుకుని ఒకరి నుంచి మరొకరికి రూ.కోట్లలో లావాదేవీలు చేస్తున్న ముఠాను కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ జి. బిందుమాధవ్ వెల్లడించారు. ఇటీవల సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన కొర్రా లో వకృష్ణకు తన స్నేహితుల ద్వారా పరిచయమైన సామర్లకోట టిడ్కో అపార్ట్‌మెంట్స్‌కు చెందిన 37 ఏళ్ల నార్ని సతీష్‌చంద్ర అలియాస్ సతీష్ పరిచయమయ్యాడు. అనంతరం సతీష్ ద్వారా ఈ ఏడాది జనవరి 31న కాకినాడ వన్‌టౌన్ పరిధిలోని కర్ణాటక బ్యాంక్‌లో లోవకృష్ణతో అకౌంట్ ఓపెన్ చేయించి ఈ అకౌంట్ ద్వారా లోన్‌లు, ప్రతి నెల రూ.5 వేలు ఇప్పిస్తానని ప్రలోభపెట్టి లోవకృష్ణతో పాటు అతడి స్నేహితులతో కూడా అకౌంట్‌లు ఓపెన్ చేయించాడు. వారికి బ్యాంక్ అకౌంట్‌లపై పెద్దగా అవగాహన లేకపోవడం బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డ్, సెల్‌సిమ్‌కార్డ్, చెక్‌బుక్ కలిపి ఒక కిట్‌గా భావించి తన స్నేహితులకు సతీష్‌కు ఇచ్చాడు. అయితే కొన్ని రోజుల తరువాత సతీష్‌ను ఎన్నిసార్లు అడిగినా లోన్‌లు రావడం లేదని లోవకృష్ణకు చెప్పాడు. అలాగే ప్రతి నెల ఇస్తానన్న రూ.5వేలు కూడా ఇవ్వక పోవడంతో సతీష్‌ను నిలదీయడంతో సరైన సమాధానం చెప్పకపోవడంతో లోవకృష్ణ కర్ణాటక బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశాడు. అయితే తన అకౌంట్ ద్వారా సుమారు రూ.50 లక్షల నగదు అక్రమ లావాదేవీలు జరిగినట్టు గుర్తించి వెంటనే కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై క్రైం నెం 140/2025 కేసు రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఎస్పీ సూచనలతో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్, కాకినాడ, పెద్దాపురం క్రైం పోలీసులను 3 ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.30 వేలకు కిట్ల అమ్మకాలు

అనంతరం సతీష్‌చంద్ర అలియాస్ సతీష్‌తో పాటు సామర్లకోటకు చెందిన 31 ఏళ్ల దాస రి వీర వెంకట సత్యనారాయణ ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. వారిద్దరూ కలిసి కాకినాడలో ఉండే ఉదయ్‌కిరణ్‌కు ఈ కిట్లను రూ.30 వేలకు అమ్ముతున్నారు. ఉదయ్‌కిరణ్ 30ఏళ్ల క్రితం సామర్లకోటలో ఉండి బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి గోవాలో క్యాసినోలో పని చేసి.. తర్వాత దుబాయ్‌కి వెళ్లిపోయిన పుట్టా రామ్ అనే వ్యక్తికి ఈ బ్యాంక్ ఖాతాల కిట్లను అందజేస్తుండగా అక్కడ నుంచి రామ్ ఈ సైబర్ క్రైం దందా నడిపిస్తున్నాడు.

50 కిట్ల స్వాధీనం

ఈ విధంగా ప్రస్తుతానికి 50 మంది బ్యాంక్ ఖాతాల ద్వారా వచ్చిన 50 కిట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ లావాదేవీలు కేవలం 2,3 నెలలో జరిగినవే. ఈ ఖాతాల ద్వారా రూ.8.80 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. ఉదయ్‌కిరణ్‌ను, పుట్టా రామ్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని కాకినాడ ఎస్పీ వెల్లడించారు. కాగా బాధితులందరు ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వారు. ప్రస్తుతానికి నిందితుల నుంచి రూ. రూ.18లక్షలు స్వాధీనం చేసుకున్నామని, బాధితులను గుర్తించి వారికి అందజేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. అయితే నార్ని సతీష్ పాత నేరస్థుడని, అతడిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, క్రైం సీఐ వి.కృష్ణ, వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు పాల్గొన్నారు.

సామర్లకోటలో పిచ్చి కుక్క దాడి

ఆరుగురికి గాయాలు

సామర్లకోట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట వీర్రాఘవపురంలో గురువారం రాత్రి పిచ్చి కుక్క దారిన వెళ్తున్న ఆరుగురు వ్యక్తులను కరిచింది. దీంతో బాధితులను స్థానికులు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. ఉన్నత చికిత్స కోసం నలుగురిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తున్నట్టు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి ఫలితం లేకపోయిందని పలువురు వాపోయారు. కాగా సామర్లకోట పట్టణ పరిధిలో పలు వార్డుల్లో ఎక్కువ మంది కుక్క కాట్లకు గురవుతున్నారని ఆసుపత్రిలో ఉన్న వ్యాక్సిన్ నిల్వలు అయిపోవడంతో వ్యాక్సిన్ అందుబాటులో ఉండడంలేదని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగతనం చేసిన ఇద్దరి అరెస్టు

కొవ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి తలుపులు పగలగొట్టి సెల్‌ఫోన్ దొంగతనం చేసిన ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఈ నెల 5వ తేదీన రాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు యువరాజ్ కేబుల్ వీధిలో నివాసం ఉంటున్న గవర దుర్గాసాయి ఇంటికి తాళం పెట్టి కొవ్వూరు గోష్పాదక్షేత్రం గోదావరినదిలో స్నానం చేసి వచ్చేలోగా ఇంటిలో చార్జింగ్ పెట్టిన సెల్ ఫోను దొంగిలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడిన కొవ్వూరు పట్టణానికి చెందిన మోడీ వెంకటస్వామి, ప్రకాశం జిల్లా దర్శికి చెందిన పులిమి బసవయ్యను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హజరుపరిచినట్టు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ-సామర్లకోట ప్రధాన కాలువలో కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లి పరిధిలోని కోటిపల్లి రైల్వే వంతెన పక్కన సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం గుర్తించినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు తెలిపారు. మృతదేహం సమారు 20 రోజులుగా నీటిలో మునిగిపోయినట్టు ఉండి శరీరం మొత్తం ఉబ్బి, చర్మం ఊడిపోయి గుర్తించడానికి వీలుగా లేని స్థితిలో ఉంది. మృతుడి శరీరంపై పింక్ కలర్ పొడవు చేతుల చొక్కా, నడుముకి నలుపు రంగు మొలతాడు ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ 9440796555లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

తిరుమాలిలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగులు తీస్తున్న ఎడ్లు



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. 50 జతలు పాల్గొన్నాయి. వీటిలో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా వీరవెంకట సత్యవేణి ఎడ్లు, కాకినాడ జిల్లా కొవ్వాడ గ్రామానికి చెందిన మట్టా నవనీత్ మణికంఠ ఎడ్లు, తూర్పు గోదావరి జిల్లా కాపవరం గ్రామానికి చెందిన కుంచం మనోజ్ రామలింగేశ్వర ఎడ్లు నిలిచాయి. జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కాకినాడ జిల్లా చేయివాడ గ్రామానికి గడ్డం అప్పారావు ఎడ్లు, పశ్చిమ గోదావరి జిల్లా దుళ్ల గ్రామానికి చెందిన బడామాను శ్రీను ఎడ్లు, తూర్పుగోదావరి జిల్లా కాపరం గ్రామానికి చెందిన బండారు శ్రీను ఎడ్లు నిలిచాయి. సీనియర్స్‌లో ప్రథమ బహుమతిగా రూ.12,000, మెమెంటో.. ద్వితీయ బహుమతిగా రూ.10,000, మెమెంటో.. తృతీయ బహుమతిగా రూ.8,000 మెమెంటోలను అందజేశారు. జూనియర్స్‌లో ప్రథమ బహుమతిగా రూ.10,000, మెమెంటో.. ద్వితీయ బహుమతిగా రూ.8,000, మెమెం టో.. తృతీయ బహుమతిగా రూ.6,000, మెమెంటోలను ప్రత్తిపాడు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై కొడవలితో వ్యక్తి దాడి

స్వల్ప గాయంతో తప్పించుకున్న తహశీల్దార్

పోలీసుల అదుపులో నిందితుడు

అయినవిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తహశీల్దార్ కార్యాలయంలోకి చొరబడి మహిళా తహశీల్దార్‌పై దాడికి ప్రయత్నించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అయినవిల్లి తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మపై తొత్తరమూడి గ్రామంలోని జోగిరాజుపాలేనికి చెందిన మీసాల సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం కొడవలితో కార్యాలయంలోకి చొరబడి దాడికి ప్రయత్నించగా ఆమె తప్పించుకునే క్రమంలో చేతికి గాయమైంది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై సత్యనారాయణను అయినవిల్లి పోలీసులకు అప్పగించారు. అయినవిల్లి ఎస్ఐ హరికోటిశాస్త్రి సత్యనారాయణపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ గతంలో ఒక హత్యా నేరంపై జైలులో కూడా ఉన్నట్టు సమచారం. బ్యాగులో ఎప్పుడూ దస్తాలు దస్తాలుగా ఫిర్యాదులు పెట్టుకుని నా భూమి ఆక్రమించుకున్నారంటూ తరచూ అధికారులు ఫిర్యాదులు చేస్తున్నాంటాడని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడూ కూడా కత్తి లేదా కొడవలిని వెంట పెట్టుకుని కాగితాలతో అలా తిరుగుతుంటాడని, వీఐపీలు వచ్చినప్పుడు వారికి దరఖాస్తులు అందించి తమ భూములు తనకు అప్పగించాలని సత్యనారాయణ కోరుతుంటాడని చెబుతున్నారు.



చేతికి గాయంతో తహశీల్దార్ నాగలక్ష్మమ్మ

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

అమలాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మపై జరిగిన దాడి ఘటనపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పదించారు. తహశీల్దార్‌కు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎడమచేతిపై చిన్న గాయమైందని ఆమె కలెక్టర్‌కు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై దాడి జరగడం బాధాకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణారావును కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాలా ఆమెకు మద్దతుగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్ తహశీల్దార్‌పై జరిగిన దాడిని ఖండించారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అన్నవరంలో హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

పడమటిపాలెంలో సరుగుడు తోటలు దగ్ధం



దగ్ధమైన సరుగుడు తోటలు

మలికిపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం పడమటిపాలెంలో 15 మంది రైతులకు చెందిన 15 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. తోటలు అంటుకోవడంతో తాము ఎంతో నష్టపోయామని పడమటిపాలేనికి చెందిన ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం



వీఆర్‌పురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం మండలం సీతంపేట గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ముత్యాల రమేష్, ముత్యాల రాంబాబుకు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఫైడే!



రాజమహేంద్రవరం హైవేపై ఆటోనగర్ వద్ద ఏర్పడిన ఎండమావులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎండలు మండి పోతున్నాయి. శుక్రవారం తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఇంటి నుంచి బయటికి వెళ్లేందుకు భయపడ్డారు.



రాజమహేంద్రవరం: ఎండలో వెళ్తున్న వాహనదారులు



మల్లేపల్లిలో ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న హైవే

వెంకన్న ఆదాయం రూ.4.83లక్షలు

ఆత్రేయపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,83,792 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రావులపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే



మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సెంట్రల్ డెల్టాలో నాలుగు నియోజకవర్గాల్లో, ఈస్ట్రన్ డెల్టాలో ఐదు నియోజకవర్గాల్లో రూ.1,650కోట్లతో రెండు వాటర్‌గ్రిడ్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. శుక్రవారం విశ్వేశ్వరాయపురంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 235 ఆవాస ప్రాంతాలకు పైపులైను ద్వారా బొబ్బర్లంక నుంచి ఇన్‌టేక్ వెల్ వెలిచేరు వద్ద ఫిల్టరైజేషన్ చేసిన స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయనున్నారన్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ ఆధ్వర్యంలో గొంది, గూడపల్లి, ఇరుసుమండ, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో ఐదు వాటరు ట్యాంకుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో త్వరలో చేస్తామన్నారు. ఈబృహత్తర పథకం కింద రాజోలు నియోజకవర్గంలో 350కిలోమీటర్ల పైపులైను ద్వారా 30వేల కుళాయిలు ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే 30వేల కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. ఈపథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని ఇస్తామని, రెండేళ్లలో ఈప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రతీ ఇంటికీ కుళాయిలు నిర్మించి జలజీవన్ మిషన్ ద్వారా కలుషితం లేని తాగునీటిని అందిస్తామన్నారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, సర్పంచ్ హెలీన, గౌరీపద్మావతి పాల్గొన్నారు.

గ్రామశాఖ అధ్యక్షులుగా సమర్థులను నియమించండి

- ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్
- పొలిట్‌బ్యూరో సభ్యుడు సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న పేరాబత్తుల రాజశేఖర్

మలికిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకులను గ్రామశాఖ అధ్యక్షులుగా ఎన్నుకోవాలని సంస్థాగల ఎన్నికల పరిశీలకుడిగా వచ్చిన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పొలిట్‌బ్యూరోసభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావులు అన్నారు. శుక్రవారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో రాజశేఖర్, రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. 60గ్రామాలకు గ్రామకమిటీలను, క్లస్టర్లను, బూత్ ఇన్‌చార్జిలను, బూత్ కమిటీకన్వీనర్లను, కుటుంబ సాధికార సారథులను వెంటనే నియమించుకోవాలన్నారు. పదవులు తీసుకునేవారు కష్టపడి పనిచేసేవారై ఉండాలన్నారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ శాసనసభ్యులు దేవ వరప్రసాద్‌తో కలిసి పనిచేయాలన్నారు. రాజోలు నియోజకవర్గంలో బాధ్యతాయుతమైన క్రమశిక్షణ గల కార్యకర్తలు ఉన్నారన్నారు. కష్టాల్లో తోడుగా ఉంటామని, కార్యకర్తల అభీష్టం మేరకు ప్రతీ విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా సఖినేటిపల్లి మండలానికి ఎం.గంగాసూర్యనారాయణ, మలికిపురం మండలానికి మట్టా ప్రభాకరరావు, రాజోలు మండలానికి తాడి నరసింహారావు, మామిడికుదురు మండలానికి అల్లాడ స్వామినాయుడులను నియమించామన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మంగెన భూదేవి, కేతా శ్రీనివాస్, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, గెడ్డం సింహ, మొల్లేటి శ్రీనివాస్, చెల్లుబోయిన శ్రీనివాస్, బత్తుల రాము, భూపతిరాజు సాయిబాబు రాజు, తాడి సత్యనారాయణ, బందెల పద్మ, మోకా పార్వతి, హెలీన, భవానీ, అడబాల సాయిబాబు, యెనుముల నాగు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లేటి రామస్వామి గజమాల యాత్ర



రాజోలు: తాటిపాకలో భారీ గజమాల యాత్ర

మామిడికుదురు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామికి సమర్పించే గజమాల యాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. తాటిపాకలోని శెట్టిబలిజ సామాజిక భవనం నుంచి ప్రారంభమైన గజమాల యాత్ర జగ్గన్నపేట, నగరం, మామిడికుదురు, పాశర్లపూడి మీదుగా అప్పనపల్లి చేరుకుంది. అధిక సంఖ్యలో శెట్టిబలిజ వర్గీయులు, రామస్వామి అభిమానులు మోటారుసైకిళ్లు, కార్లపై ర్యాలీగా అప్పనపల్లి చేరుకున్నారు. అప్పనపల్లిలో ఉన్న రామస్వామి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. ఆయాకార్యక్రమాల్లో శెట్టిబలిజ సంఘ నాయకులు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, అనుచూరి పురుషోత్తం,చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాంబాబు, నయినాల రామకృష్ణ, కాండ్రేగుల శ్రీను, కడలి నూకరాజు, నయినాల కాశీ, పెచ్చెట్టి సత్యచంద్ర, పితాని సురేంద్ర, అధిక సంఖ్యలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

తాటిపాక నుంచి గజమాల యాత్ర

రాజోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాటిపాకలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం భవనం నుంచి అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామికి సమర్పించే గజమాల యాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. తాటిపాక నుంచి నగరం, మామిడికుదురు మీదుగా యాత్ర అప్పనపల్లి చేరుకుంది. అధికసంఖ్యలో అభిమానులు గజమాల యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, గుబ్బల ఫణికుమార్ అనుచూరి పురుషోత్తం, కాండ్రేగుల కృష్ణ, చెల్లింగి లక్ష్మీశ్వరి, గుబ్బల శ్రీనివాస్, చిట్టూరి వేణు, గుబ్బల బాబ్జి, చెల్లుబోయిన రాంబాబు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

అమలాపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే విజ్ఞానం పొందవచ్చునని సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైనందుకు అభినందనలు తెలిపారు. విజ్ఞాన తరగతుల ముగింపు సభ గ్రంథాలయ నిర్వాహకులు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విజ్ఞానానికి మూలం పుస్తక పఠనమేనన్నారు. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విజ్ఞాన కేంద్రాలు

మామిడికుదురు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంఈవో లక్ష్మీనారాయణ సూచించారు. మామిడికుదురు శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో పాల్గొని శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథలయ నిర్వాహకులు ఏ కేఆర్ సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు సీహెచ్ కేశవరావు, టి.బాలబాలాజీ, ఎం.సీతారామచంద్రమూర్తి, ఈదరాడ బీడీసీ కన్నబాబు, ఎస్టీఎల్ దేవి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

మలికిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేశనపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు జరిగిన శిక్షణ తరగతుల్లో పలువురు శిక్షణ పొందారు. సర్పంచ్ యెనుముల నాగు తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యర్రంశెట్టి గోపాలకృష్ణ, గ్రంథాలయ అధికారిణి కె.ఇందిరపాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమం గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. శిక్షణ తరగుతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్‌ను ఎంఈవో మోకా ప్రకాష్ అందించారు.

కోనసీమ అందాలు.. విభిన్న కథలతో చిత్రాలు రావాలి



గంగలకుర్రులో వారణాశి చిత్రదర్శక నిర్మాత రాహుల్‌రాయ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అంబాజీపేట, జూన్6(ఆంధ్రజ్యోతి):కోనసీమ అందాలు.. విభిన్న కథలతో మంచి చిత్రాన్ని రూపొందించి ప్రేక్షకులకు అందించాలని డీఎస్‌వో అడపా ఉదయ్‌భాస్కర్ సూచించారు. గంగలకుర్రు రిసార్ట్స్‌లో వారణాశి చిత్రయూనిట్ బృందం సత్కారసభ కోకోఫెడ్ చైర్మన్, కళాపరిషత్ అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా డీఎస్‌వో ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ వారణాశి చిత్రాన్ని యూట్యూబ్‌లో రిలీజ్ చేయడం ద్వారా మంచి స్పందన వచ్చిందన్నారు. ఏకాదశ రుద్రుల్లో ఒక్కరైన చెన్నమల్లేశ్వరస్వామి వేంచేసి ఉన్న గంగలకుర్రు గ్రామంలో చిత్రయూనిట్‌కు సత్కారం జరగడం అదృష్టమన్నారు. చిత్ర దర్శక, నిర్మాత అడబాల రాహుల్‌రాయ్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగికదాడులను అరికట్టకపోతే భవిష్యత్ మహిళల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యాన్ని వారణాశి చిత్రంలో పొందుపర్చామని, నిందితులకు ఉరిశిక్ష అమలు చేయడమే మార్గమని, లేకుంటే మరింత మంది మృగాలు పట్టుకోస్తారని విషయాన్ని ఈచిత్రంలో రూపొందించినట్లు తెలిపారు. కాగా దుర్యోధన ఏకపాత్రాభియనంలో రంగస్థలంపై ప్రతిభ కనభరుస్తున్న గంగలకుర్రుకు చెందిన శంభూప్రసాద్‌ను సత్కరించారు. అనంతరం చిత్ర దర్శక, నిర్మాత అడబాల రాహుల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, నాగార్జున సాగర్, యేడిద శ్రీను, శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎస్వీ నాయుడు, ఆదిత్యాకిరణ్, అడపా శివయ్య, అడపా బాబ్జి, పులిదిండి సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహం, నూకపెయ్యి చిన్న, ఎస్ఎస్ఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు



మాట్లాడుతున్న మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు

పి.గన్నవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను అధిష్ఠానం గుర్తిస్తుందని మాజీ మంత్రి, నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామచంద్రరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కష్టపడిన కార్యకర్తలకు మాత్రమే పార్టీ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని వారు కోరారు. ఈనెల 10వ తేదీలోపు గ్రామస్థాయిలో ఆయా గ్రామాల నాయకులు సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలన్నారు. తద్వారా ఈనెల 15లోపు మండల స్థాయి పదవులతో పాటు క్లస్టర్, బూత్ కమిటీలను, యూనిట్ ఇన్‌చార్జీలను నియమించుకోవాలని సూచించారు. అనంతరం సంస్థాగత ఎన్నికలు గ్రామస్థాయిలో, మండలస్థాయిలో ఏవిధంగా నిర్వహించాలో నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్లు మోకా ఆనందసాగర్, డీవీవీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోళ్ళ ప్రసాద్, మద్దాల సుబ్రహ్మణ్వేశ్వరరావు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెద్దిరాజు, చిట్టూరి శ్రీని వాస్, ముకరం సుదా బాబ్జి, మొల్లేటి శ్రీనివాస్, శ్రీనురాజు, అంబటి కోటేశ్వరరావు, యండ్ర శ్రీనివాసరావు, పెచ్చెటి వెర్రియ్య, పత్తిపాటి వెంకన్నబాబు, అరిగెల బాలరామ్మూర్తి, శేరు శ్రీను బాబు, కె.సత్యనారాయణరాజు, కేదాశి చిన్న, ఆకుమర్తి ఆశీర్వాదం, నిమ్మకాయల శేషు తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన భోజనం అందించాలి



వంటకార్మికులకు సూచనలు చేస్తున్న జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సురేష్

ఉప్పలగుప్తం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆరోగ్యకరమైన భోజనాన్ని వండి వడ్డించాలని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సురేష్ వంటకార్మికులకు సూచించారు. శుక్రవారం గొల్లవిల్లి హైస్కూల్లో మండలంలోని మధ్యాహ్న భోజన వంటకార్మికులకు జరిగిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇక నుంచి మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా చేస్తామన్నారు. పరిశుభ్ర వాతావరణంలో భోజనం తయారు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. మెనూ ప్రకారం మాత్రమే వంట చెయ్యాలన్నారు. వంటకార్మికులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులందించారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర

అమలాపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసనాలు ఆరోగ్యానికి శాసనాలు వంటివి అన్నారు. శారీరక, మానసిక సమస్యలను దూరం చేసేందుకు యోగాసనాలు, ధ్యానం ఏవిధంగా దోహదపడుతుందో పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి వివరించారు. రెండు గంటల పాటు నిర్వహించిన యోగాసనాలను, ధ్యానం కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.రాణిసంయుక్త, పశువైద్యాధికారి డాక్టర్ నారాయణరావు, డాక్టర్ చైతన్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేసే వ్యక్తిని ఎన్నుకోండి

పుట్టినరోజు వేడుకల్లో మల్లాడి కృష్ణారావు



వేంకటేశ్వరస్వామి వేషధారుడితో మల్లాడి

యానాం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా యానాం ఊరి కోసం పనిచేసే నిజాయితీ పరుడిని రానున్న ఎన్నికల్లో ఎన్నుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం యర్రాగార్డెన్స్‌లో శుక్రవారం మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో మల్లాడి కృష్ణారావు 62పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. తొలుత యానాం వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం మల్లాడి స్వగృహంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం మల్లాడి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాజకీయం ఒక్క యానాం సీటుతో ఉండదని పుదుచ్చేరిలోని ఐదు ప్రాంతాల నుంచి ఎమ్మెల్యేలను గెలిపించే విధంగా తన నిర్ణయం ఉంటుందన్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటా నన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టులను యానాం వస్తాయన్నారు. యానాం పరిసర ప్రాంతాల నుంచి ప్రముఖులు, పురప్రజలుతరలివచ్చారు. అభిమానులు గజమాలలు, పుష్పగుచ్ఛాలు మల్లాడికి అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంకు చెందిన విక్టరీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాఖపట్నంకు చెందిన, నంది అవార్డు గ్రహీత సూర్య ప్రదర్శించిన వెంకటేశ్వరస్వామి వేషధారణ ఆకట్టుకుంది. డాక్టర్ శాంతకుమార్, యాంకర్ ప్రసన్న, మైండ్‌రీడింగ్ శ్రీనివాస్, విశాఖపట్నంకు చెందిన డిజెదిల్లు డ్యాన్స్ టీమ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


ముగిసిన కామేశమహర్షి సిద్ధిసమాధి



పీఠంలో కామేశమహర్షి సిద్ధి సమాధి చేస్తున్న భక్తులు, ప్రేమమందిరం చిన్నారులు

అమలాపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశమహర్షి గురువారం బ్రహ్మీభూత సిద్ధిని పొందారు. శుక్రవారం శ్రీకామక్షీపీఠ మహాసంస్థానం ప్రాంగణంలో కామేశ మహర్షి సిద్ధి సమాధి కార్యక్రమం నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి అయిన విఘనస రాటీప్రేమ్ క్రతువు నిర్వహించగా గోవిందవర్జుల నాగబాబు బృందం ఇతర క్రతువులు పూర్తిచేశారు. సిద్ధ పురుషులు, స్వామిజీలకు సిద్ధి సమాధి కార్యక్రమాన్ని నిర్వహించే రీతిలో శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభించి కామేశ మహర్షికి పంచానువాకములతో అభిషేకం, విరజా హోమాలు అనంతరం స్వామివారి సమాధి ప్రవేశం జరిపించారు. తమను కన్న తల్లిదండ్రుల కంటే గొప్పగా పెంచి, పెద్ద చేసి విద్యా బుద్ధులు నేర్పించిన గురువు లేకపోవడంతో కామాక్షీ ప్రేమ మందిరం చిన్నారులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రేమ మందిరం పూర విద్యార్థులు సైతం ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఈకామాక్షీ దేవిచారిటబుల్ ట్రస్టు సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కామేశ మహర్షికి నివాళులర్పించారు.

ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



అంబాజీపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌నకు మండలంలోని జడ్పీ హైస్కూల్స్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట నుంచి నెల్లి యామిని, ముత్తాబత్తుల నిశియాంజల్, జి.అతినాప్రసాద్, తొండవరం నుంచి పెదమల్లు శ్రీమానస్విని, గంగలకుర్రు అగ్రహారం నుంచి చొల్లంగి జాహ్నవిశివదుర్గ, దొంగ లేఖనా మహాలక్ష్మిలు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు 9వతరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు వంతున కేంద్రం స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుంది. విద్యార్థులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని శేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందు, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు బక్రీద్ వేడుకలు

మండపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండపేట జామియా మసీదులో శనివారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ మహమద్ గులాం మహ్మద్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. బక్రీద్ సందర్భంగా శనివారం ఈదుల్ జుహా నమాజ్ నిర్వహించనున్నట్టు ఇమామ్ తెలిపారు. ఇస్లాం శాంతియుత సహజీవనాన్ని బోధిస్తుందన్నారు.

తహశీల్దార్‌పై దాడికి ఖండన

అయినవిల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మమ్మపై జరిగిన దాడి ఘటనను ఏపీ ఆర్ఎస్ఏ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామ పంచాయతీ పరిధిలోని జోగిరాజుపాలేనికి చెందిన మీసాల సత్యనారాయణకు చెందిన పని ఏదీ కార్యాలయంలో పెండింగ్‌లో లేదని, సదరు దాడికి పాల్పడిన వ్యక్తికి అయినవిల్లి మండలంలోని ఏ గ్రామంలో కూడా వ్యవసాయ భూములు లేవని, అలాంటప్పుడు ఎందుకు అయినవిల్లి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి విధి నిర్వహణలోఉన్న తహశీల్దార్ నాగలక్ష్మమ్మపై కత్తితో ఎందుకు దాడికి పాల్పడ్డాడో పోలీసు విచారణలో తెలియాల్సి ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్ కోరారు.

'దేశాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలు'



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు

అమలాపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మతోన్మాద శక్తులతో కలిసి కార్పొరేట్ కంపెనీలు దేశాన్ని, ప్రజలను దోచుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు విమర్శించారు. అమలాపురంలోని సీపీఎం కార్యాలయంలో నూకల బలరామ్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ మతోన్మాద శక్తులు దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకువచ్చి విచ్ఛిన్నానికి ఈశక్తులు కుట్ర చేస్తున్నాయన్నారు. మతోన్మాద శక్తులను ఓడించడమే లక్ష్యంగా భవిష్యత్తులో సీపీఎం పనిచేస్తుందన్నారు. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లాకమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, పీతల రామచంద్రరావు, సీహెచ్ సూర్యప్రకాశరావు, వి.మోహనరావు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై దాడికి ఖండన..

అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మమ్మపై దాడిని సీపీఎం జిల్లాకమిటీ తీవ్రంగా ఖండించింది. ఘటనకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అధికారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రీవెరిఫికేషన్‌లో పెరిగిన మార్కులు

మామిడికుదురు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మామిడికుదురుకు చెందిన ముత్యాల సాయిసహస్రకు 593 మార్కులు రాగా ఆమె రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. రీవెరిఫికేషన్‌లో విద్యార్థికి 4 మార్కులు పెరిగి 597 మార్కులు రావడంతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మ్యాథ్స్, సైన్స్, తెలుగు, సోషల్ సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు రాగా ఇంగ్లీషులో 99, హిందీలో 98 మార్కులు వచ్చాయి. ఆమెను పలువురు అభినందించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని నిరసన



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ముమ్మిడివరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ముమ్మిడివరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఠాణేలంక పంచాయతీ పరిధిలోని వడ్డిగూడెం గ్రామ ప్రజలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. గత సంవత్సర కాలంగా గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని, లోఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. తరచూ లోఓల్టేజ్ సమస్య, విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, లైన్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని ఏఈ శివశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాటి సతీష్, గుత్తుల బ్రహ్మానందం, యిళ్ల ఏడుకొండలు, కుడుపూడి సత్యనారాయణ, గుత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ జయంతి

మలికిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మురాల ముకేష్‌కు మహేష్‌బాబు అభిమానులు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

తెలుగుదేశం గ్రామశాఖ అధ్యక్షుడు మృతి

మలికిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుడిమెల్లంకకు చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెల్లింగి వెంకటశ్రీరామ సుబ్రహ్మణ్యశెట్టి (62) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రజానాట్య మండలి జిల్లాస్థాయి శిక్షణా తరగతులు



శిక్షణా తరగతుల్లో డాక్టర్ స్టాలిన్

అమలాపురం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా నాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం అమలాపురం గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ హాలులో వేమగిరి శామ్యూల్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే శిక్షణకు డాక్టర్ చెలికాని స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు మహంతి లక్ష్మణరావు, ముప్పన కుమార్, పోలిశెట్టి కృష్ణ, మందపల్లి ప్రేమానందం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవి, ఉమేష్, నిమ్మకాయల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శికొప్పుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో టిక్కెట్ కౌంటర్ ప్రారంభం

అంతర్వేది, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో రామేశ్వరానికి చెందిన చెరుకూరి వంశీలక్ష్మీపతిరాజు, పేరిచర్ల రామరాజువర్మ రూ.1.80లక్షలతో ఏర్పాటుచేసిన టిక్కెట్ కౌంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. తొలుత ఈటిక్కెట్ కౌంటర్‌కు ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతలకు వేదాశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు.

గోవులకు రేడియం ట్యాగ్‌లు

అంతర్వేది, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఇటీవల ప్రధాన రహదారిపై రాత్రి సమయంలో గోవులు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి సమయంలో రహదాలపై దూరంగా ఉన్న గోవులను గుర్తించడానికి స్థానికులు రేడియం ట్యాగ్స్ సమకూర్చారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో గోవులకు రేడియం ట్యాగ్స్ వేశారు.

నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్లు

అమలాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్నక్యాంటీన్లను పునరుద్ధరించిందని ఆర్డీవో కె.మాధవి తెలిపారు. శుక్రవారం అమలాపురం, ముమ్మిడివరంలలో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్ల నిర్వహణ తీరును మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అన్నక్యాంటీన్లలో అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజన ఏర్పాట్లు పూర్తి నాణ్యతతో అందించాలని సూచించారు. క్యాంటీన్ల నిర్వహణ తీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈకార్యక్రమం చేపట్టిందన్నారు. రూ.5తో రుచికరమైన నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. అన్న క్యాంటీన్లకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.రాణిసంయుక్త, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ముమ్మిడివరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్‌లో పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని పేదలకు అందించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి నిర్వాహకులకు సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్లగేటు సెంటర్‌లో ఉన్న అన్నక్యాంటీన్‌ను ఆర్డీవో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆహార నాణ్యతను ఆమె పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రజలతో కలిసి భోజనంచేసి క్యాంటీన్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. ఆహారం అందించే ప్లేట్లు, మంచినీటి సౌకర్యం, పరిసరాలు తదితర వాటిని ఆమె నిశితంగా పరిశీలించారు. ఇన్‌చార్జి కమిషనర్ పీవీ సుధాకర్, రెవెన్యూ, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవనీత అలంకరణలో వేణుగోపాల స్వామి, స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం

● నవనీత అలంకరణలో స్వామివారు

ఆత్రేయపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక దివ్యకల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామికి అభిషేకం నిర్వహించి నవనీత అలంకరణ నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిం చి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో చక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.


ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు



రావులపాలెం ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు

●ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు

మండపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చిన సమస్యలకు తక్షణం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం కార్యాలయంలో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వార్డులు, గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. విద్యుత్, భూసమస్యలు, తాగునీరు తదితర అంశాలపై వినతులు అందించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జూన్6(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కారానికి సత్వరమే ఆయా అధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమం ధ్యేయంగా పనిచేయడంతోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు.

దత్త షిర్డీసాయిని దర్శించుకున్న మంత్రి సుభాష్


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సుభాష్

రాయవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసలపూడి గ్రామంలో ఉన్న దత్త షిర్డీ సాయి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసంశెట్టి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అంగర జనార్ధనశర్మ పర్యవేక్షణలో షిర్డీ సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. ఈ పూజాకార్యక్రమాల్లో రాష్ట్ర కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుతగా ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోతంశెట్టి స్వరూపరెడ్డి, మల్లిడి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మారిన సుబ్బారావునాయుడు, సాయి భక్తులు పాల్గొన్నారు.

మండపేటలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు

మండపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి):నిరుద్యోగ యువతీయువకులు ఉద్యోగాల సాధనకు జాబ్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 11 కంపెనీలు పాల్గొన్నాయి. 206 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. 94 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, పసలపూడి శ్రీనివాసరావు, రాయుడు గంగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి కార్మికుల నిరసన


ఒంటి కాలుపై నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

మండపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శుక్రవారం 14వ రోజుకు చేరింది. శుక్రవారం పురపాలకసంఘ కార్యాలయం ఎదురుగా మండుటెండలో ఒంటికాలుపై నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి సుబ్బరాజు, కప్పల సురేంద్ర, టేకి వెంకన్న, పిట్టా ప్రవీణ్‌కుమార్, గంటి నవీన్ కుమార్, సైనం భాస్కర్, పాలపర్తి సురేష్‌ఖన్నా, మత్తల రమేష్, తలాటి వెంకన్న, కొండేపూడి వెంకటేశ్వర్లు, అన్నవరం, సంతోష్, వాసంశెట్టి బాలరాజు, వాసు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నిరసన


అంగరలో ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

కపిలేశ్వరపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం అప్రకటిత విద్యుత్‌కోతలపై వినియోగదారులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేలటూరు, నల్లూరు, వెదురుమూడి, వల్లూరు, తదితర గ్రామాల నుంచి వినియోగదారులు చేరుకుని ధర్నా నిర్వహించారు. అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు, ఓ పక్క ఉక్కపోత, మరోపక్క దోమల మోతలతో అవస్థలు పడుతుంటే వేలాపాలా లేకుండా విద్యుత్ కోతలతో ప్రజలను నిద్రలేని రాత్రులు గడిపేలా చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ కోతలు నివారించి మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని అధికారులను కోరారు. పలు గ్రామాలకు లైన్‌మెన్ల కొరత ఉందని వెంటనే వారిని నియమించాలని ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఏఈ మాట్లాడుతూ వేసవి కారణంగా వినియోగం పెరగడంతో లోడ్ ఎక్కువైందని మరో 10 రోజుల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వెంకట్రావు, వల్లూరి వీరబాబు, మేడిశెట్టి శ్రీనివాస్, గుబ్బల సూరిపండు, రుద్రాక్షల సోమేష్ పాల్గొన్నారు.

మడికిలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

ఆలమూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికిలో ఇటీవల కాలంలో లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పెనుమాక నరేష్ ప్రజాదర్బార్‌లో శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రం అందించారు. లోవోల్టేజ్ సమస్యల కారణంగా వేసవిలో విద్యుత్‌కు తరచూ అంతరాయం ఏర్పడటంతోపాటు అనేక ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లు లేని కారణంగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేదన్నారు. ఈవిషయంపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండాపోయిందని తక్షణం ఈవిషయంపై స్పందించి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని నరేష్ కోరుతూ వినతిపత్రం అందించారు. మడికి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఎమ్మెల్యే బండారు ఆదేశించారు.

నేడు బక్రీద్

మండపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండపేట జామియా మసీదులో శనివారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ మహమద్ గులాం మహ్మద్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. బక్రీద్ సందర్భంగా శనివారం ఈదుల్ జుహా నమాజ్ నిర్వహించనున్నట్టు ఇమామ్ తెలిపారు. ఇస్లాం శాంతియుత సహజీవనాన్ని బోధిస్తుందన్నారు.

నిరుపయోగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు


● శిథిలస్థితికి చేరుకున్న వైనం

● రహదారుల చెంతనే డంపింగ్‌యార్డులు

● పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ మాటలలోనేనా..!


ఈతకోట పరిధిలో నిరుపయోగంగా ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు

రావులపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య సాధనకు పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ఏర్పాటుచేసిన సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్లు నిరుపయోగంగా మారడంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన కేంద్రాలు వృథాగా మిగిలిపోయాయి. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలమయ్యారని సర్వాత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రావులపాలెం మండలంలో లక్షలాది రూపాయలతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్మించారు. రావులపాలెంలో పూరిస్థాయిలోకి వినియోగంలోకి రాగా మిగిలిన గ్రామాల్లో అరకొరకగా ఉన్నతాధికారులు వచ్చినప్పుడు హడావిడి తప్ప పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చిన దాఖలాలు లేవు. కేతరాజుపల్లిలో నిర్మించిన షెడ్ శిథిలస్థితికి చేరి కూలిపోతుంది. ఆ షెడ్ వద్దే రహదారి చెంతనే గ్రామంలోని వ్యర్థాలు పారవేస్తుండటంతో డంపింగ్ యార్డులను తలపించే విధంగా ఆ ప్రాంతం తయారైంది. కొన్ని గ్రామా ల్లో అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా ఏవిధంగా ప్రారంభించారో ఇప్పుడు అదేవిధంగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలంటూ జిల్లాస్థాయి అధికారులు నిరంతరం టెలికాన్ఫరెన్స్‌లు, అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ వీటి నిర్వహణ మాత్రం అంతంతమాత్రంగానే ఉండిపోతుంది. పారిశుధ్య సిబ్బంది గ్రామాల్లో తడి, పొడిచెత్తలను వేర్వేరుగా సేకరించి వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేసి దాని ద్వారా ఆయా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా వీటి నిర్మాణ సమయంలో కార్యాచరణ రూపొందించారు. ఆదాయంమాట అటుఉంచితే అసలు వీటిని వినియోగంలోకి తేవడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. సంపద తయారీ కేంద్రాలకు వ్యర్థాలను తరలించకపోవడంతో గ్రామ ముఖద్వారాలు డంపింగ్ యార్డుల్లా దర్శనమిస్తున్నాయి.


కేతరాజుపల్లిలో శిథిలస్థితికి చేరిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్


రహదారుల చెంతనే డంపింగ్ యార్డులను తలపిస్తున్న చెత్తకుప్పలు

యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి

● రామచంద్రపురం ఆర్డీవో అఖిల


ఏర్పాట్లు పరిశీలిస్తున్న రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల

ద్రాక్షారామ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ స్ఫూర్తితో వెల్తీ, హెల్తీ, హ్యాపీ స్వర్ణాంధ్రకు పునాదిపడేలా యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆర్డీవో దేవరకొండ అఖిల ఆదేశించారు. శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఈనెల 9న నిర్వహించనున్న యోగా గ్రాండ్ ఈవెంట్ ముందస్తు ఏర్పాట్లను ఆర్డీవో అధికారులతో కలసి పరిశీలించారు. బాధ్యతలు తీసుకున్న అధికారులు కార్యక్రమాన్ని సఫలీకృతం చేయాలని అన్నారు. సోమవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా గురువులు యోగాభ్యాసనాలు చేస్తారన్నారు. భీమేశ్వరాలయం అంతఃప్రాంగణంలో యోగా ఈవెంట్ నిర్వహణకు సంబంధించి ఆలయ సహాయ కమిషనర్, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. ప లు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆల య సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానీ, తహసీల్దార్ మృత్యుంజయరావు, ఉప విద్యాశాఖాధికారి, అధికారులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థులతో పాటు పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు యోగా సాధన చేయించారు. కార్యక్రమంలో వ్యాయామ పీడీ ముత్తా సత్యనారాయణ, జుత్తుగ మల్లిఖార్జునుడు, మేకా చిన్న, గ్రామ కార్యదర్శి శివచక్రవర్తి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


అభినయ్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

కపిలేశ్వరపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పరిరక్షణకు యువత నడుం బిగించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంగర సిద్దార్థ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీగ్రామంలోను చెట్లు నరికివేయడంవల్ల పర్యావరణం దెబ్బతింటుందని ప్రతీఒక్కరూ చెట్లు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ప్రభుత్వం అందించే ప్రతిభా అవార్డుకు ఎంపికైన గొడితి అభినయ్‌ను సత్కరించారు. డిప్యూటీ ఎంపీ డీవో ఈశ్వరరావు, మోహన్, గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర్, చైర్మన్ వి.దివ్యశేఖర్, కరస్పాండెంట్ వి.రాజా, ప్రిన్సిపాల్ రమణ పాల్గొన్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

మలికిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దివంగత సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మహేష్‌బాబు అభిమానులు తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్న మురాల ముకేష్‌కు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కృష్ణమహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

16న వాడపల్లిలో యోగాంధ్ర

● ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలో ఈనెల 16న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో శ్రీకర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణవేదిక వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్‌తో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. స్వామివారి ఆలయలం లో చేపడుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు చేపడుతున్న సౌకర్యాలను ఆయన పరిశీలించి సూచనలు అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానవంతులు కావొచ్చు


కపిలేశ్వరపురంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానవంతులు కావచ్చునని కపిలేశ్వరపురం గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం వంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. 35 రోజులుగా విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించిన గ్రంథాలయాధికారిణి డి.శివకుమారిని వారు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, పాస్టర్ ఏసురత్నం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

ఆత్రేయపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో 33 రోజులపాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారం ఘనంగా ముగిశాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ వేసవి శిబిరంలో పాల్గొని విజ్ఞానాన్ని పెం పొందించుకున్నారు. ముగింపు సభలో స్థానిక సర్పంచ్ జి.సుధ పాల్గొని విద్యార్థులకు ఈ తరగతులు ఎంతవరకూ ఉపయోగపడ్డాయో అడిడి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి పి.నమ్మశివాయ, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న దృశ్యం

'పుస్తక పఠనం మేథో సంపన్నులను చేస్తుంది'

ద్రాక్షారామ, జూన్6(ఆంధ్రజ్యోతి): పుస్తకపఠం మేథో సంపన్నులను చేస్తుందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ముగింపు సమావేశం జరిగింది. గతనెల 28 నుంచి శుక్రవారం వరకు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల్లో పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, బహమతులు అందజేశారు. విశ్రాంత అధ్యాపకుడు బి.శివరామ్, ఉపాధ్యాయులు ఎం.సాయిరాజ్, గ్రంథాలయాధికారి ఎం.వి.సూరిబాబు,విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు బహుతులు అందజేస్తున్న అతిథులు

వైభవంగా గోపాలస్వామి కల్యాణం


గోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి క్షేత్రపాలకుడు శ్రీ గోపాలస్వామి దివ్యకల్యాణ మహోత్సవం ఏకాదశి శుక్రవారం కన్నుల పండుగగా నిర్వహించారు. సాయంత్రం అంకుర్పారణ, ధ్వజారోహణం నిర్వహించి కల్యాణోత్సవానికి ఏర్పాట్లుచేశారు. అనంతరం రాత్రి స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన కల్యాణంలో అశేషభక్తజనం పాల్గొన్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి కల్యాణోత్సవంలో పాల్గొని ఏర్పాట్లు పరిశీలించారు. ఈనెల 8న సదస్యం, 11న చక్రస్నానం, 12న శ్రీపుష్పోత్సవంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

జేఈఈ ర్యాంకర్ తేజకు డీటీవో అభినందన


ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న డీటీవో

ఆలమూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో 172వ ర్యాంకు సాధించిన నాగిరెడ్డి తేజచంద్రనారాయణను జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన నాగిరెడ్డి శ్రీనివాస్, నాగ అరుణ దంపతుల కుమారుడు తేజ ఆల్‌ఇండియా స్థాయిలో ఈడబ్ల్యూఎస్ 172వ ర్యాంకు, ఒపెన్ కేటగిరిలో 1911 ర్యాంకు సాధించారు. విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ ఉన్న జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు ప్రత్యేకంగా చెముడులంక వచ్చి అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళకు రూ.15 వేలు సాయం అందజేత


మహిళకు ఆర్థికసాయం అందచేస్తున్నమంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 6(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం కొత్తూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న గెద్దాడ విజయలక్ష్మీకి మంత్రి సుభాష్ రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆమె కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమె ఆర్థిక పరిస్థితి కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. మెరుగైన వైద్యసేవలు పొంది త్వరగా కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతున్న రాంబాబుకు సాయం అందజేత

ఆలమూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంనకు చెందిన మట్టపర్తి రాంబాబు ఆసుపత్రిలో చికిత్స పొందతున్నారు. దీంతో ఆ కుటుంబానికి కొత్తపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ రూ.10వేల ఆర్థికసాయం అందించారు. రాంబాబు బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన విషయం స్థానిక నాయకులు బండారు శ్రీనివాస్‌కు తెలియజేయడంతో స్థానిక జనసేన నాయకుడు సలాది జయప్రకాష్‌నారాయణ చేతుల మీదుగా రాంబాబు కుటుంబానికి సాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


మూలస్థానంలో పేద కుటుంబానికి సాయం అదిస్తున్న దృశ్యం